



ఆలయాలకు కార్తీక శోభ

కీసర రామలింగేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



ధారూరు: సత్యనారాయణస్వామి పూజలో భక్తులు



రామలింగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



కీసరలో...

కీసర/ఘట్‌కేసర్/ధారూరు నవంబరు11(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో భక్తులు పరమశివుడి సేవలో తరిస్తున్నారు. కార్తీక రెండో సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కీసరగుట్టలో శ్రీ రామలింగేశ్వర స్వామికి శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కుటుంబ సమేతంగా గర్భాలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కుకున్నారు. ఇళ్లలో వ్రతాలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ధారూరులోని వీరభద్రేశ్వర ఆలయంలో శివలింగానికి జలం, పంచామృతంతో అభిషేకం చేశారు. ముత్తైదువులకు వాయినాలు ఇచ్చారు. ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్, అంకుశాపూర్, కొర్రెముల, ఎదులాబాద్, ప్రతాప్‌సింగారం, వెంకటాపూరం తదితర గ్రామాల్లో శివాయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎదులాబాద్ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో శివలింగంను ప్రత్యేకంగా ఆలంకరించి పూజలు నిర్వహించారు. యాలాలలోని సంగమేశ్వరాలయంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

నిత్య విద్యార్థిగానే విద్యను అభ్యసించాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్/కొడంగల్ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చదువుకునే క్రమంలో నిత్య విద్యార్థిగానే విద్యను అభ్యసించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. మౌలానా అబుల్‌కలాం అజాద్ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని (మైనార్టీ సంక్షేమ దినం) నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రభుత్వం మైనార్టీల సంక్షేమంతో పాటు పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలను అందించి అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, హన్మంత్‌రావు, మంజుల రమేష్, సుధాకర్‌రెడ్డి, తస్వర్ అలీ, వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపల్ మహబూబ్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం కొడంగల్ మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామములో పీఏసీఎస్ హస్నాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని సూచించారు. రైతులు దళారులను నమ్మి మొసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీసీవో నాగలింగాచారి, రామకృష, పీఏసీఎస్ అధ్యక్షుడు కటకం శివకుమార్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ సుధీర్



దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాలకు చెందిన 125 మంది నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌డీఏ, ఇతర శాఖలకు సంబంధించిన ఆర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ శ్రీనివాస్, ఆర్‌డీవో వాసుచంద్ర, డీపీవో జయసుధ, ఏవో ఫరీనాఖాతుమ్, డిప్యూటీ తహసీల్దారు దీపక్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ఇండస్ట్రియల్ కారిడార్‌కు భూములు సేకరించేందుకు వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం, దుద్యాల మండలం, లగచర్లలో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం హైటెన్షన్ క్రియేట్ చేసింది. ఫార్మా కోసం మా భూములు తీసుకోవద్దని ఆగ్రహావేశాలకు గురై ఉన్నతాధికారులని కూడా చూడకుండా రైతులు దాడులకు దిగారు. పోలీసుల ఎదుట అధికారుల వాహనాలను ధ్వంసం చేశారు. దీంతో భయాందోళనకు గురైన అధికారులు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



లగచర్లలో అధికారులతో ఘర్షణకు దిగిన గ్రామస్తులు

హైటెన్షన్

ఉన్నతాధికారులతో రైతుల ఘర్షణ.. లగచర్లలో ఉద్రిక్తత

- ఫార్మా ఇండస్ట్రియల్ కారిడార్‌కు భూములు తీసుకోవద్దని కోపోద్రిక్తం
- కర్రలు, రాళ్లతో కలెక్టర్, అధికారుల వాహనాల ధ్వంసం
- ఘటనా స్థలంలో పోలీసులున్నా ఆగని ఘర్షణ
- భద్రత కల్పించడంలో పోలీసు, నిఘా వైఫల్యమని ఆరోపణలు
- సంఘటనపై పోలీసుల దర్యాప్తు.. గ్రామంలో పటిష్ట భద్రత



కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిపై దాడి చేస్తున్న రైతులు

వికారాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కొడంగల్/బొంరాస్‌పేట్: కొడంగల్ నియోజకవర్గం, దుద్యాల మండలం, లగచర్ల రణరంగంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం దుద్యాల మండలంలో ప్రతిపాదించిన ఫార్మా ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసేందుకు భూసేకరణ కోసం సోమవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభం కాకుండానే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమావేశానికి హాజరై రైతుల సమస్యలు, డిమాండ్లు తెలుసుకునేందుకు కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్

- మిగతా 7వ పేజీలో...

జిల్లావ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు 7

ఫార్మా కంపెనీతో రైతులకు నష్టం

- ఫార్మా కంపెనీతో రైతులకు నష్టం
- రెండు పంటలు పండే భూములు ఇచ్చేందుకు ముందుకు రాని రైతులు : బీఆర్ఎస్

8

ఎక్కడి చెత్తబండి అక్కడే..

- మరమ్మతులు లేక మూలనపడిన వాహనాలు
- రిపేరు పేరిట రూ.25 లక్షలు డ్రా..
- టెండర్లు లేకుండానే ఇష్టారీతిన చెల్లింపులు
- తాండూరు బల్దియాలో పారిశుధ్యం అస్తవ్యస్తం

7



ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

- తన చావుకు ఎవరూ కారణం కాదని సూసైడ్ నోట్
- అమ్మా.. జాగ్రత్త అంటూ పేర్కొన్న యువకుడు
- ఘట్‌కేసర్ పరిధి బాలాజీనగర్‌లో ఘటన

8

అల్మాస్కాన్‌పేట్‌లో భూముల సర్వే



భూ సర్వే చేస్తున్న అధికారులు

కులకచర్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాలతో మండలంలోని అల్మాస్కాన్‌పేట్ రెవెన్యూ పరిధిలో సోమవారం రెవెన్యూ అధికారులు భూసర్వే నిర్వహించారు. అల్మాస్కాన్‌పేట్ పరిధిలో 1 నుంచి 86 వరకు ఉన్న సర్వే నంబర్లలో 1,056 ఎకరాల భూమి ఉంది. అందులో ఘనపూర్, పుట్టపహాడ్, చిన్నవార్వాల్, పెద్దవార్వాల్, రుసుపల్లి గ్రామాలకు చెందిన 113 మంది రైతులు కాస్తులో ఉన్నారు. గత ప్రభుత్వం ధరణి తీసుకురావడంతో కాస్తు కాలం నుంచి వారు తొలగించబడ్డారు. గతంలో ఉన్న పట్టాదారుల వారసుల పేర్లు ధరణిలో వచ్చాయి. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవతో రెవెన్యూ పరిధిలోని రైతులు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి న్యాయం చేయాలని కోరారు. దీంతో కలెక్టర్ గత నెల 26న ఆయా భూములను పరిశీలించారు. సర్వే చేయించి పాస్ పుస్తకాలు జారీ చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. తహసీల్దార్ మురళీధర్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలు భూముల సర్వే చేపడతామన్నారు. రైతులు పొలాల దగ్గర అందుబాటులో ఉండి తమ దగ్గర ఉన్న ధ్రువపత్రాలు సర్వే అధికారులకు చూపించాలన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

శాసన మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి



జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి

వికారాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించేలా ప్రోత్సహించాలని శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని శివారెడ్డిపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలల పాఠశాల ఆవరణలో 10వ జోనల్ స్థాయి అండర్ 14, 17, 19 బాలు క్రీడా పోటీలను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా వివిధ పాఠశాలల విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ ద్వారా అతిథులకు స్వాగతం పలికారు. ఈ పోటీల్లో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల నుంచి చిలుకూరు, మొయినాబాద్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, గౌలుదొడ్డి, కందుకూరు, కొడంగల్, కొందుర్గు, పరిగి, శంషాబాద్, పెద్దేముల్, శివారెడ్డిపేట్ నుంచి 12 పాఠశాలకు సం బంధించిన 971 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ. గ్రామీణ విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాల్లో కూడా ప్రాధాన్యం కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం వాలీబాల్ పోటీలను మహేందర్ రెడ్డి ప్రారంభించారు. అలాగే వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని బీటీఎస్ కాలనీలో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఆఫీసర్ నిర్మల, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జోనల్ క్రీడా పోటీలు

షాద్‌నగర్‌రూరల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గురుకుల పాఠశాలల విద్యార్థులు రాణించి దేశానికే ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆకాంక్షించారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల పాఠశాలలో సోమవారం 10వ జోనల్ గేమ్స్‌ను క్రీడా జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ నెల 14 వరకు జరిగే ఈ పోటీల్లో తెలంగాణాలోని 13 గురుకుల పాఠశాలల నుంచి 1300 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుకులాల జాయింట్ సెక్రటరీ సంతోషి, ప్రిన్సిపాల్ విద్యులత, ఎంఈఓ మనోహర్ పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఆపద మొక్కుల అమ్మ..

మైసిగండి మైసమ్మ



15 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

- ఆరు రోజులపాటు సాగనున్న జాతర
- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న అధికారులు
- 17న పెద్ద రథోత్సవం, 19న కార్తీక దీపోత్సవం
- అమ్మవారి దర్శనానికి ప్రత్యేక లైన్లు



కడ్తాల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైసిగండి మైసమ్మ ఆలయం 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల(జాతర)కు ముస్తాబైంది. అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏటా కార్తీక పౌర్ణమి నుంచి కార్తీక పంచమి వరకు కనుల పండువగా నిర్వహిస్తారు. ఆరు రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగే జాతరకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. మైసిగండి మైసమ్మ జాతర రాష్ట్ర స్థాయిలో ఖ్యాతిగాంచింది. గ్రామీణ వాతావరణాన్ని, ఎగ్జిబిషన్‌ను తలపిస్తోంది. రాష్ట్రం నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్ర, అంధ్రప్రదేశ్ నుంచి కూడా భక్తుల రాక నేపథ్యంలో నిర్వాహకులు, దేవాదాయ శాఖ అధికారులు బ్రహ్మోత్సవాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారు. మైసమ్మ గిరిజనుల ఆరాధ్య దేవత కావడంతో జాతర సందర్భంలో ఇక్కడ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ ఆలయం మత సామరస్యానికి ప్రతీక. ఇక్కడ జరిగే పూజల్లో హిందువులతో పాటు ముస్లింలు కూడా పాల్గొనడం విశేషం. జాతర సమయంలో కొన్ని ముస్లిం కుటుంబాలు ఇక్కడ ప్రత్యేక మొక్కులు తీర్చుకుంటారు. మైసిగండి మైసమ్మ ఆలయ వెనుక భాగంలో ఉన్న కోనేరు పవిత్ర గంగ సమతుల్యతను సంతరించుకొంది. ఇక్కడ స్నానమాచరిస్తే సర్వరోగాలు నయమవుతాయని, పుణ్య ఫలం లభిస్తుందన్నది భక్తుల విశ్వాసం.

ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు

15 నుంచి 20వ తేదీ వరకు కొనసాగే మైసమ్మ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు ఆలయం వద్ద అన్ని రకాల వసతులు ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారి దర్శనానికి ప్రత్యేక క్యూ ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ శిరోలిపంతూ, ఈఓ స్నేహలత తెలిపారు. హైదరాబాద్, కల్వకుర్తి, అచ్చంపేట, దేవరకొండ, తదితర ప్రాంతాల నుంచి జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని చెప్పారు.

19న మహాలింగార్చన



బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ కార్యనిర్వాహణ అధికారిణి స్నేహలత వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కులుగకుండ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. 15న క్షీరాభిషేకం, విశేష అలంకరణ, కుంభహారతి 16న చిన్నతేరు, విశేష పూజలు, 17న పెద్ద రథోత్సవం, 18న విశేష పూజలు, అమ్మవారికి బోనాలు, బండ్లు తిప్పుట, శత చండీ హోమం ప్రారంభం, 19న కార్తీక దీపోత్సవం, మహాలింగార్చన, పుష్పార్చన, 20న అమ్మవారికి వివిధ కూరగాయాలతో అలంకరణ, ముగింపు వేడుకలు నిర్వహించనున్నట్లు ఈవో వివరించారు.

- స్నేహలత, ఆలయ కార్యనిర్వాహణ అధికారిణి

అన్ని ఏర్పాట్లు పూర్తి



అమ్మవారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. అన్ని ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు నడపాలని అధికారులను కోరాం. భక్తులు అమ్మవారి దర్శనం కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నాం.

- రామావత్ శిరోలిపంతూ, ఆలయ ఫౌండర్, ట్రస్టీ

మొక్కుబడిగా ధాన్యం కొనుగోళ్లు

కేంద్రాలకు చేరని ధాన్యం.. దళారులకు విక్రయిస్తున్న రైతులు



చింతపట్లలో ధాన్యాన్ని శుభ్రం చేస్తున్న రైతులు

యాచారం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాచారం, చింతపట్ల, నందివనపర్తి కేంద్రాలలో మొక్కుబడిగా ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. రెండు కేంద్రాలకు సోమవారం సాయంత్రం నాటికి 70 క్వింటాళ్ల ధాన్యం చేరింది. యాచారం కేంద్రానికి గింజ రాలేదు. ఆయా గ్రామాలకు చెందిన దళారీలు రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. మండలం పరిధిలో 18 రోజులుగా వరి కోతలు ప్రారంభమయ్యాయి. వరికోతలకు ముందే కొనుగోలు కేంద్రాలను తెరవాల్సి ఉన్నా అధికారుల నిర్లక్షంతో ధాన్యం దళారులకు చేరుతుంది. దళారులు క్వింటాల్‌కు రూ2,400 ధర చెల్లిస్తుండడంతో రైతులు దళారీలకే ధాన్యం అప్పగిస్తున్నారు. కాగా ప్రభుత్వం క్వింటాల్ ధాన్యాన్ని రూ2,300లకు కొనుగోలు చేస్తోంది. దళారీలు రూ.100 అధికంగా ఇస్తుండడంతో రైతులు దళారులవైపు మొగ్గుచూపుతున్నారు. గత వారం రోజుల క్రితం నందివనపర్తి, చింతపట్ల గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడమే కాని గింజ రాలేదు. కాగా కొంత మంది దళారులు పంట వేసే సమయంలో రైతులకు అప్పులు ఇచ్చి అప్పు కింద ధాన్యాన్ని కొంటున్నట్లు పలువురు రైతులు తెలిపారు. గతంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే నానా ఇబ్బంది పెట్టడంతో నేడు దళారులకు విక్రయించక తప్పడం లేదని కొందరు రైతులు తెలిపారు. కాగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని మండల వ్యవసాయాధికారి రవినాథ్ రైతులను కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు



వినతి పత్రాన్ని అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కొత్తూర్, నవంబర్ 11:(ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా ఎదుర్కొంటున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కారించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, జిల్లా మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కమిషనర్ బాలాజీకి కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులందరికి కనీస వేతనాలు అందించి, ఉద్యోగం పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీవోలు విడుదల చేసిన అధికారులు అమలు పర్చడంలేదని వాపోయారు. కార్మికుల సమస్యలు పరిష్కారించేవరకు ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సంఘం నాయకులు జంగయ్య, సంజీవ, కార్మికులు రోజా, శ్రీను, అంజమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి సన్మానం



ఎమ్మెల్యే కసిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): లండన్ పర్యటన ముగించుకొని స్వరాష్ట్రానికి చేరుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని సోమవారం ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కిషన్ రెడ్డి, బీచ్యనాయక్, డోకూరు ప్రభాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం

కేంద్రంపై సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేశ్ మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న బాలమల్లేశ్

ఇబ్రహీంపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీలు ఉపాధిలేక ఇబ్బంది పడుతుంటే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.బాలమల్లేశ్ ఆరోపించారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఓటు బ్యాంకు రాజకీయాలకోసం మతం పేరుతో ప్రజలను విడదీస్తున్నారంటూ ఆయన విమర్శలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుంటే ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భూసేకరణ పేరుతో రైతులనుంచి భూములు తీసుకోవడంతో వ్యవసాయ కార్మికులు రోడ్డున పడుతున్నారని బలవంతపు భూసేకరణ చేయవద్దని అన్నారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య, జిల్లా అధ్యక్షుడు జంగయ్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కావలి నర్సింహ, నాయకులు ఓ.యాదయ్య, యాదిరెడ్డి, నీలమ్మ, రాజునాయక్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైవే నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్



విలేకరులతో మాట్లాడుతున్న శుభప్రద్ పటేల్

పూడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు చేపట్టిన జాతీయ రహదారి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మన్నెగూడ గెస్ట్ హౌస్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకో ప్రాణం గాలిలో కలిసిపోతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. జాతీయ రహదారి నిర్మాణ పనులపై ఎందుకు నిర్లక్ష్యం జరుగుతుందని ప్రశ్నించారు. రహదారి నిర్మాణానికి కావాల్సిన అన్ని సౌకర్యాలు ఉండి టెండర్లు పూర్తయినప్పటికీ పనులను ప్రారంభించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. త్వరగా ఈ పనులను ప్రారంభించకపోతే రోడ్డును స్తంభింపజేస్తామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం త్వరగా పనులు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో పూడూరు మండల మాజీ ఎంపీపీ మల్లేశం, రాజేందర్, రామస్వామి, శేఖర్, దయానంద్, జాతీయ రహదారి సాధన సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉర్సుకు రావాలంటూ కేటీఆర్‌కు ఆహ్వానం



ఆహ్వానం అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్


కొత్తూర్, నవంబర్ 8:(ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్‌లోని కడప అమీన్‌పూర్ దర్గా ఉర్సుకు హాజరుకావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వానం అందజేశారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామానికి చెందిన అమీన్‌పూర్ దర్గా శిష్యులు ఆయనకు సోమవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. 16నుంచి 20వ తేదీ వరకు దర్గా హజరత్ సూఫీ సర్ మస్త సాని చిల్లా కష్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిపుల్లా హుస్సేయిని ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. కేటీఆర్‌తో పాటు మాజీ హోంమంత్రి మహమూద్‌అలీకి ఆహ్వానం అందజేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ దర్గా శిష్యులతో పాటు, మత పెద్దలు సాధక్, ఎస్కె బాజీ, అఫ్జల్, షైక్, నవాజ్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు , నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు కల్పించి అన్ని రకాల వైద్య సేవలు అందించాలని ఆయన అన్నారు. బండోనిపల్లి గ్రామానికి చెందిన సరోజకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 16 వేల చెక్కును సోమవారం ఆమనగల్లు పట్టణంలో బాధిత కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చి దిద్దాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రూపం వెంకట్ రెడ్డి, సుభాష్, సతీశ్, సుమన్ నాయక్, శివకుమార్, తదితరులు ఉన్నారు.

ఎక్కడి చెత్తబండి అక్కడే..



మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిలిచి ఉన్న చెత్తను సేకరించే ఆటో

మూలన పడిన ట్రాక్టర్

తుప్పుపట్టిన డోజర్

- మరమ్మతులు లేక మూలనపడిన వాహనాలు
- రిపేరు పేరిట రూ.25 లక్షలు డ్రా.. అయినా అదే దుస్థితి
- టెండర్లు లేకుండానే ఇష్టారీతిన చెల్లింపులు
- తాండూరు బల్దియాలో పారిశుధ్యం అస్తవ్యస్తం

తాండూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీ పారిశుధ్య విభాగంలో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. వాహనాల మరమ్మతుల పేరిట అడ్డగోలుగా నిధులను డ్రా చేస్తున్నా- అడిగే వారు కరువయ్యారు. నిబంధనలను పట్టించుకోకుండా చెల్లింపులు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పారిశుధ్య విభాగంలోని ఆటోలు, ట్రాక్టర్లు మరమ్మతుల పేరిట రూ.15 లక్షలు బల్దియా ఖజానా నుంచి డ్రా చేశారు. కానీ ఫలితాలు శూన్యం. కనీస మరమ్మతులకు నోచుకోక ఎక్కడి చెత్తబండి అక్కడే అన్నట్లుగా మూలకుపడ్డాయి. దీంతో రోడ్లపై చెత్త కుప్పలుకుప్పలుగా దర్శనమిస్తోంది.

కార్యాలయం వెనుకభాగంలో..

గడిచిన ఆరు నెలలుగా ఇదే తంతు. మరమ్మతుల పేరిట డ్రా చేసిన నిధులు ఎక్కడకు వెళ్తున్నాయో అర్థం కాని దుస్థితి. బల్దియాకు చెందిన డోజర్ వాహనం ఆరు నెలల క్రితం రిపేరుకు వచ్చింది. నేటివరకు దాన్ని పట్టించుకోకపోవడంతో వాహనం తుప్పుపడుతోంది. తాండూరు మున్సిపాలిటీలో లక్షలు వెచ్చించి జేసీబీని కొనుగోలు చేశారు. మరమ్మతుల కోసమని హైదరాబాద్ నగరంలో మెకానిక్ షెడ్డుకు తరలించారు. మరమ్మతులు పూర్తి అయి రెండు నెలలు గడిచినా ఆ జేసీబీని తీసుకురాలేని దుస్థితి. దాని మరమ్మతులకు పెద్ద మొత్తంలో నిధులు చెల్లించారు. ప్రస్తుతం ఆ జేసీబీ షెడ్డులో ఉందా ? ఇతర ప్రైవేటు పనులకు వినియోగిస్తున్నారా అనే విషయం అంతుపట్టడం లేదు. రూ.లక్షలు చెల్లించి మరమ్మతులు చేయించిన వాహనాలు సైతం మున్సిపల్ కార్యాలయం వెనుక భాగంలో నిరుపయోగంగా ఉన్నాయి. పారిశుధ్య విభాగానికి చెందిన 10 ఆటోలు, ట్రాక్టర్లు మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయి.

టెండర్‌లు లేకుడానే చెల్లింపులు

దాదాపు రూ.25 లక్షల నిధులను మున్సిపల్ వాహనాల మరమ్మతుల పేరిటగా మున్సిపల్ అధికారి చెల్లింపులు చేశారు. కనీసం పర్యవేక్షించకుండానే ఈ చెల్లింపులు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నిధుల చెల్లింపులో చాలా వరకు నిబంధనలు పాటించకుండానే చేశారని ఆరోపణలు ఉన్నా.. కౌన్సిలర్లు నోరు మెదపడం లేదని స్థానికంగా చర్చించుకుంటున్నారు. మున్సిపల్ కార్యాలయంలో డంపింగ్ యార్డు వద్ద మెకానిక్ షెడ్డు , తాండూరు ప్లై ఓవర్ బ్రిడ్జికింద ఎక్కడ పడితే అక్కడ మున్సిపల్ ఆటోలు, ట్రాక్టర్‌లు మరమ్మతుల పేరిట తెచ్చి పెట్టి వెళ్లిపోతున్నారు. వాహనాలు లేని కారణంగా చెత్త ట్రాక్టర్లు మరమ్మతులలో ఉన్నాయని శానిటేషన్ సిబ్బంది చెత్త సేకరణపై చేతులేతుస్తున్నారు. వాహనాలు కాలనీలలో సకాలంలో తిరగని కారణంగా రోజు వారి చెత్త సేకరణ జరగడం లేదు. ఎక్కడ పడితే అక్కడ వదిలేసిన చెత్త సేకరణ వాహనాల్లోని టైర్లు, బ్యాటరీలు కూడా చోరికి గురవుతున్న పట్టించుకునే వారు లేరు. ఈ ఏడాది మార్చి30న రూ.12,19,640, మే 17న రూ.3,51,707 చొప్పున శానిటేషన్ వాహనాల మరమ్మతులకు నిధులను వినియోగించారు.



మరమ్మతులకు నోచుకోని చెత్త తరలించే ఆటోలు



ప్లైఓవర్ కింద వదిలేసిన చెత్త తరలించే ఆటో



తుప్పు పట్టిన చెత్త తరలింపు ఆటో



పాత మున్సిపల్ భవనం ఆవరణలో నిరుపయోగంగా పరమపద వాహనం

పట్టింపులేని పరమపద వాహనం

ఎవరైనా చనిపోతే అంతిమయాత్ర కోసం మున్సిపాలిటీ పరమపద వాహనాన్ని కొనుగోలు చేసింది. ఈ వాహనాన్ని ఉపయోగించకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయింది. ఎవరైనా స్వచ్ఛంద సంస్థకు, ప్రభుత్వ ఆసుపత్రికి అప్పగించినా అది ఉపయోగంలో ఉండేది. ఈ వాహనం కొనుగోలు చేసి మూలన పడేశారు. స్వచ్ఛ్ భారత్ పేరిట కొనుగోలు చేసిన వాహనాలు ఉపయోగంలోకి తీసుకురాకపోవడంతో ఉన్న చోటే తుప్పు పట్టి పోతున్నాయి.

సమగ్ర సర్వేలో తప్పులు జరగొద్దు

- ఉద్యోగులు సమయపాలన పాటించాలి
- ఫామ్స్‌ను జాగ్రత్తగా భద్రపరచాలి
- డేటా ఎంట్రీ ఆపరేటర్లను సమకూర్చుకోవాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రజావాణిలో సమస్యలను వింటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సర్వేలో తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతీమాసింగ్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సౌమ్య తో కలిసి మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేకధికారులు, మండల అభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ సమయపాలన పాటిస్తూ సర్వే నిర్వహించాలని తెలిపారు. సోమవారంతో 3 రోజు సర్వే నిర్వహిచడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు గుర్తించిన కుటుంబాలు 6,04,351 కాగా 1,00,202 కుటుంబాల నుంచి సమాచారం సేకరించడం జరిగిందన్నారు.

సందేహాలు నివృత్తి చేసుకుంటూ..

మండలాల్లో ఎంపీడీవో, పంచాయతీ సెక్రెటరీలు, ఎన్యూమరేటర్లతో సమన్వయం చేసుకుంటూ, మున్సిపల్ పరిధిలో కూడా మున్సిపల్ కమిషనర్లు వారికి వచ్చే సందేహాలను నివృత్తి చేసుకుంటూ సర్వే ముందుకు పోవడానికి కృషి చేయాలని తెలిపారు. రోజువారిగా పూర్తియిన సర్వే ఫారంలను ట్రంక్ బాక్స్‌లో ఎన్యూమరేటర్ బ్లాక్ వైజ్‌గా భద్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఫారంను కంప్యూటరీకరణ చేసుకోవడం కోసం ఆపరేటర్లను సమకూర్చుకోవడం, టెక్నికల్ సపోర్టు కంప్యూటర్లను మండలాలు, మున్సిపల్ వారీగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేశ్ మోహన్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రామారావ్, డీఈవో సుశీందర్‌రావు, మండల ప్రత్యేకధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు సంబంధిత ప్రణాళిక శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 13 వేల భూ సమస్యలు

జిల్లాలో ధరణి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ముందస్తుగా మూడు నెలల్లో చిన్న చిన్న భూ సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు. జిల్లాలో అన్ని రకాల భూ సమస్యలు సుమారు 13 వేల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. భూముల ధరలు పెరగటం వల్ల భూ సమస్యలు పెరిగాయన్నారు. నాదర్‌గూల్‌లోని సర్వే నంబర్ 92లో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగిందన్నారు. విద్యాభివృద్ధిపై దృష్టి సారించడం జరిగిందని ఇప్పటికే శంషాబాద్, షాద్‌నగర్, శంకర్‌పల్లి వంటి ప్రాంతాల్లో పలు పాఠశాలలు తనిఖీ చేపట్టామన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజావాణికి 67 ఫిర్యాదులు

రంగారెడ్డి అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను తర్వగా పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 67 ఫిర్యాదులను స్వీకరించారు. అందులో రెవెన్యూకు సంబంధించి అత్యధికంగా 56, ఇతర శాఖలకు 11 ఫిర్యాదులు ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. హయాత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న అజయ్ అనే విద్యార్థి పాఠశాల గేట్ మీద పడి మృతి చెందాడు. ఆ విద్యార్థి కుటుంబానికి రూ. 5 లక్షల రూపాయల పరిహారం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రణరంగం.. సదర్ ఉత్సవం

పలువురికి గాయాలు..

షాద్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం రాత్రి యాదవులు నిర్వహించిన సదర్ ఉత్సవం రణరంగంగా మారింది. ఇద్దరు వ్యక్తుల వల్ల జరిగిన గొడవ తీవ్ర ఘర్షణలకు దారితీసింది. దీంతో సహనం కోల్పోయిన మరో వర్గం నాయకులు కూడా రెచ్చిపోవడంతో వివాదం తీవ్ర స్థాయికి చేరుకుంది. ఈ ఘర్షణలో పలువురికి గాయాలు అయ్యాయి. పరిస్థితి విష మిస్తుండంటంతో పోలీసులు లాఠీచార్జీ చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ పట్టణంలో యాదవ కులస్తులు సదర్ ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి తదితరలు హాజరయ్యారు. వీరు వెళ్లిన అనంతరం ఇద్దరు యువకులు స్టేజీ మీదకి దూసుకొచ్చి స్టేజీ మీద ఉన్నవారితో ఘర్షణకు దిగారు. దీంతో అందరూ చూస్తుండగానే కర్రలతో పరస్పర దాడులకు పాల్పడ్డారు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు ఆపేందుకు ప్రయత్నించారు. పరిస్థితి విష మిస్తుడంటంతో లాఠీచార్జీ చేశారు. లాఠీచార్జీలో పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు గాయపడ్డారు.

హైటెన్షన్

(5వ పేజీ తరువాయి)

లింగ్యానాయక్, తాండూరు ఆర్డీవో ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కొడంగల్, దుద్యాల తహసీల్దార్లు విజయకుమార్, కిషన్‌నాయక్‌లతో కలిసి లగచర్ల శివారులో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. అక్కడ రైతులు లేకపోవడంతో అధికారులు అవాక్కయ్యారు. రైతులందరూ లగచర్లలో ఉన్నారని తెలుసుకున్న కలెక్టర్ సమస్య పరిష్కారానికి కృషి చేయాలనే ఉద్దేశంతో అక్కడికి వెళ్లారు. భూములు ఇచ్చేది లేదని ఆగ్రహంతో రైతులు ఒక్కసారిగా అధికారులపై దాడి చేశారు. ఫార్మా ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు మొత్తం 1,350 ఎకరాలు అవసరమని గుర్తించారు. భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు రూ.10 లక్షల పరిహారంతో పాటు ఎకరాకు డీటీసీపీ లేఔట్‌లో 125 చదరపు గజాల ఇంటి స్థలం, ఔట్‌సోర్సింగ్‌లో ఒక ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. భూమి కోల్పోయే వారికి ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరు చేయాలనే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. రైతులపై ఒత్తిడి చేయకుండా, భయపెట్టకుండా వారికి నచ్చజెప్పి భూములు ఇచ్చేందుకు అంగీకరింపజేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. లగచర్లలో భూసేకరణ అంశం గత కొన్ని రోజులుగా వాయిదా పడుతూ వస్తుంది. ప్రజాభిప్రాయాన్ని స్వయంగా తెలుసుకునేందుకు కలెక్టర్ ఆ గ్రామానికి రాగా, ఊహించని విధంగా దాడికి తెగబడ్డారు. జిల్లా ఉన్నత అధికారులపై ఈ స్థాయిలో దాడులు జరగడం ఇదే తొలిసారి. ముందు జాగ్రత్తగా పోలీసులు లగచర్ల గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో ప్రజాభిప్రాయ సేకరణ కోసం సమావేశం ఏర్పాటు చేశారు. రైతులు అక్కడకు సమావేశానికి హాజరు కాకపోవడంతో కలెక్టర్, అధికారులు గ్రామంలోకి వెళ్లారు. ఆ సమయంలో రైతులు వారిపై తిరగబడడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. దుద్యాల మండలంలోని లగచర్ల, పోలెపల్లి, దుద్యాల, ఆర్‌బీ తండా, పులిచర్ల తండాల రైతులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ సందర్భంగా అక్కడి రైతులు ప్రభుత్వానికి, కలెక్టర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కర్రలు, రాళ్లతో దాడి చేశారు.



ఘర్షణకు ముందు కలెక్టర్‌తో మాట్లాడుతున్న లగచర్లకు చెందిన సురేశ్

పోలీసు యంత్రాంగం వైఫల్యం

ఫార్మా కంపెనీ భూ సేకరణలో భాగంగా గతంలో చోటు చేసుకున్న ఉద్రిక్త సంఘటనల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం మరింత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాల్సిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత నెలలో దుద్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుటి శేఖర్‌ను నిర్బంధించిన సమయంలో పోలీసులకు, రైతులకు మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలిసిందే. ఆ సంఘటన మరవక ముందే లగచర్లలో జిల్లా అధికారులపై దాడి సంఘటన చోటు చేసుకుంది. కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు వస్తున్న నేపథ్యంలో పోలీసులు బందోబస్తు పకడ్బందీగా ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో చోటు చేసుకునే పరిస్థితులను అంచనా వేయడంలో పోలీసులు, నిఘా విభాగం విఫలమైందని పలువురు ఆరోపించారు. జిల్లా అధికారులపై దాడులు జరిగినా పోలీసులు ముందస్తుగా సమాచారం ఇవ్వకపోవడం, సరైన రక్షణ కల్పించలేకపోయారనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి.



దాడిలో ధ్వంసమైన కారు

అదనపు కలెక్టర్ బంగారు గొలుసు చోరీ

వికారాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): లగచర్ల గ్రామంలో అధికారులపై జరిగిన దాడిలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు గాయాలు కావడంతో పాటు ఆయన మెడలో ఉన్న బంగారు గొలుసు కూడా చోరీకి గురైంది. రైతులు ఒక్క సారిగా దాడికి పాల్పడి మెడపట్టి లాగడంతో అప్రమత్తమైన ఆయన ఒక వైపు షర్ట్‌తో పాటు మెడలోని గొలుసును గట్టిగా పట్టుకోగా మరో వైపు బలంగా లాగడంతో అది తెగిపోయి చోరీకి గురైంది.

సంయమనంతో వ్యవహరించిన అధికారులు...

తమపై దాడి జరుగుతున్నా అధికారులు సంయమనంతో వ్యవహరించారు. తమ వాహనాలపై రాళ్లు, కర్రలతో దాడి చేసి ధ్వంసం చేసినా.. అధికారులు రైతులపై ఆగ్రహం వ్యక్తం చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. లగచర్లలో పోలీసు బలగాలు మొహరించి ఉన్నా.. ఇతర చర్యలకు ఆదేశించకుండా కలెక్టర్, అదనపు కలెక్టర్ తిరిగి కలెక్టరేట్‌కు వచ్చి తమ విధుల్లో నిమగ్నమయ్యారు.



పోలీస్ అధికారిపై దాడి చేస్తున్న రైతులు

వెల్లువెత్తిన నిరసనలు



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

తాండూరు రూరల్/పూడూరు/మోమిన్‌పేట్/యాలాల/పరిగి/తాండూరు/ధారూరు/దోమ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దుద్యాల మండలం లగచర్లలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు రెవెన్యూ అధికారులపై అక్కడి రైతులు దాడి చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తాండూరు తహసీల్దార్ కార్యాలయ ఇబ్బంది పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు సోమవారం విధులు బహిష్కరించి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్‌పై దాడి హేయమన్నారు. కలెక్టర్ కే రక్షణ లేకుండా ఉంటే కింది స్థాయి సిబ్బంది పరిస్థితి ఏమిటని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం దాడి చేసిన వారిపై చర్యలు తీసుకు ని ఇలాంటి సంఘటన పునరావృత కాకుండా చూడాలని వారు కోరారు. పూడూరు తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి సిబ్బంది నిరసన తెలిపారు. మోమిన్‌పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిబ్బంది నిరసన తెలిపారు. తహసీల్దార్ అంజయ్య ఆధ్వర్యంలో సిబ్బంది విధులు బహిష్కరించి యాలాల తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి నినాదాలు చేశారు. పరిగి తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు విధులు బహిష్కరించారు. కలెక్టర్, రెవెన్యూ అధికారులపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు కొందరు రైతుల ముసుగులో వచ్చి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే కుట్ర పన్నారన్నారు. ఈ దాడుల వెనుక బీఆర్ఎస్ నాయకుల హస్తం ఉందని అన్నారు. ధారూరు తహసీల్దార్ సిబ్బంది విధులను బహిష్కరించి, కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. దోమ తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది దాడులను ఖండించారు.

కలెక్టరేట్ ఎదుట అధికారులు, సిబ్బంది ధర్నా

వికారాబాద్ : భూసేకరణపై ప్రజాభిప్రాయం సేకరించేందుకు దుద్యాల మండలం, లగచర్ల గ్రామానికి వెళ్లిన కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తదితర అధికారులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జిల్లా అధికారుల సంఘం డిమాండ్ చేసింది. అధికారులపై దాడి చేయడాన్ని నిరసిస్తూ వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకే రక్షణ లేకపోతే కిందిస్థాయి ఉద్యోగుల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు.



యాలాల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

కార్తీక శోభ


తాండూరు: లింగార్చనలో పాల్గొన్న భక్తులు

శామీర్‌పేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో కార్తీక మాస శోభ సంతరలించుకుంది. రెండవ సోమవారం శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శామీర్‌పేట శ్రీ భవానీరామలింగేశ్వరస్వామి (శివాలయం)లో ఆలయ ప్రధానార్చకులు గడియారం మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం భక్తులు పెద్ద ఎత్తున కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో శామీర్‌పేటకు చెందిన భజనమండలి ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపించారు. అదేవిధంగా తూంకుంట మపరిధిలోని శ్రీగాయత్రి మహాక్షేత్రంలో ఉమామహేశ్వరస్వామికి ఆలయ వ్యవస్థాపకులు, వాక్‌బ్రహ్మ శిశ్య జనోద్ధారక డాక్టర్ ఎస్‌వీఎల్‌ఎన్‌మూర్తి ఆధ్వర్యంలో పూజలు చేశారు.

తాండూరు: తాండూరు భావిగిభద్రేశ్వర ఆలయంలోని శివాలయంలో కొలువైన శివుడిని కార్తీకసోమవారం సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేశారు. శివుడిని కొలనుపాక సోమేశ్వరస్వామి అలంకరణలో అర్చకుడు శివకుమార్ అలంకరణ చేసి భక్తులను ఆకట్టుకున్నారు. ఈరూపంలో భక్తులకు భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక సోమేశ్వరస్వామి రూపంలో దివ్యదర్శనం ఇచ్చారు. అదేవిధంగా కార్తీక దీపోత్సవంలో భాగంగా సోమవారం సాయంత్రం 3516 పార్థివ లింగాల లింగార్చన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలో హేరూర్ వార్డులోని కన్య పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమాన్ని పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది మహిళలు తరలివచ్చి పూజలు చేశారు. విశేషదీపారాధన, మహామంగళ నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు.

మోమిన్‌పేట్: కార్తీకమాసంలో అమ్మకు పాదపూజ చేసుకోవడం ఎంతో పుణ్యమని తెలంగాణ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీ శంకర్‌స్వామి అన్నారు. రెండవ కార్తీక మాసం సోమవారం సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ సంగమేశ్వర ఆలయంలో గోసేవకులు వండర్ బుక్ ఆఫ్ రికార్డు సంగమేశ్వరచారి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, శివలింగ ప్రతిష్ఠాపన, గురువులకు, పీఠాధిపతులకు, మఠాధిపతులకు, తల్లిదండ్రులకు, ముత్తయిదులకు అమ్మకు వందనం, గోమాత పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ భైలూర్ యోగేశ్, ప్రభుదాస్, గో సేవలకులు వండర్ బుక్ ఆఫ్ రికార్డు సంగమేశ్వరచారి గ్రామస్థులు పాల్గొన్నారు.


శామీర్‌పేట: శ్రీభవానిరామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


మోమిన్‌పేట్: మాణిక్య ప్రభు ఆలయంలో పూజలు


కీసర: కీసరగుట్టపై దీపాలు వెలిగిస్తున్న భక్తులు


కీసర: రామలింగేశ్వరుడి సేవల్లో యాదాద్రి కలెక్టర్ హనుమంత్ రావు

రామలింగేశ్వరుని సేవల్లో యాదాద్రి కలెక్టర్

కీసర: కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామిని యాదాద్రి కలెక్టర్ హనుమంత్‌రావు సోమవారం దర్శించుకున్నారు. కార్తీక మాసోత్సవంలో భాగంగా కలెక్టర్ హనుమంత్‌రావు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆలయ మహా మండపంలో ఆశీర్వచనలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు ఆలయ ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా ఆలయ నిర్వహకులు ఆకాశదీపోత్సవం నిర్వహించారు.

క్రైం కార్నర్

భార్యతో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య

మేడ్చల్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సోమారం గ్రామానికి చెందిన కుమార్(34) ఆదివారం రాత్రి తన భార్యతో గొడవ పెట్టుకున్నాడు. దీంతో భార్య తన పిల్లలతో కలిసి ఆరుబయట పడుకుంది. సోమవారం ఉదయం లేచి ఇంట్లోచూడగా కుమార్ ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెందాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఉరేసుకుని యువకుడు..

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురై ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ పరుశురాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ పరిధి బాలాజీనగర్‌కు చెందిన కానుకుర్తి సుభాష్(24) కొండాపూర్‌లోని ఓట్యాబ్లెట్ల పరిశ్రమలో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం పనిఉందని కుటుంబసభ్యులకు చెప్పి ఇంటి వద్దే ఉన్నాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దింపి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 'నా చావుకు ఎవరు కారణం కాదు, డబ్బులు ఖర్చుచేయకు. అమ్మా.. జాగ్రత్తగా ఉండు.' అంటూ సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

మేడ్చల్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శామీర్‌పేట్ మండలం దేవర్‌యాంజాల్ గ్రామానికి చెందిన కిషోర్‌రెడ్డి(49) సంగారెడ్డి జిల్లా బొంతపల్లి సమీపంలోని ప్రైవేటు పరిశ్రమలో పనిచేసుకుని ఆదివారం సాయంత్రం తన బైక్(స్కూటీ)పై ఇంటికి తిరిగి వస్తుండగా మండలంలోని అయోధ్య చౌరస్తా వద్ద వాహనం జారి కింద పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


బండవెల్కిచర్లలో దగ్ధమైన ఇల్లు

కులకచర్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన నర్సింహులుగౌడ్ కుటుంబసభ్యులు సోమవారం పూజ నిర్వహించి బయటకువెళ్లారు. అంతలోనే షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో నిప్పంటుకుంది. ఇంట్లో ఉన్న బీరువాలో సామాన్లు, వస్తువులు, తినుబండరాలు, దుస్తులు పూర్తిగా దగ్ధమయ్యాయి. గ్రామస్థులు గమనించి నీటితో మంటలను చల్లార్చారు. అనంతరం పరిగి నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో నర్సింహులు గౌడ్ కుటుంబం కట్టుబట్టలతో బయటే ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై కేసు

పెద్దేముల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనుమతులు తేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పెద్దేముల్ ఎస్ఐ గిరి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామశివారు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న గోపాల్‌నాయక్‌కు చెందిన ట్రాక్టర్, మేఘావత్‌రమేష్‌కు చెందిన ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్లను తహసీల్దార్‌కు వాటిని అప్పగించామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అధికారులపై దాడి హేయం


కొడంగల్: నిరసన తెలుపుతున్న ఎంపీడీవో, సిబ్బంది

కొడంగల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలోని లగచర్లలో ఫార్మా కంపెనీ భూ అభిప్రాయ సేకరణలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిలపై దాడికి పాల్పడటం హేయమైన చర్య అని ఎంపీడీవో ఉషశ్రీ, సిబ్బంది ఖండించారు. అధికారులపై దాడికి నిరసనగా దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బొంరాస్‌పేట్: లగచర్లలో ఫార్మా కంపెనీ భూ అభిప్రాయ సేకరణలో జరిగిన దాడి రైతుల ముసుగులో బీఆర్ఎస్ గుండాలు అధికారులపై దాడులు చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఉద్యమం ముసుగులో బీఆర్ఎస్ కార్యకర్తలను దాడులకు ప్రోత్సహించారని ఆరోపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, గోవర్ధన్‌రెడ్డి, కృష్ణ, మల్లేశ్, శేఖర్, రాములు పాల్గొన్నారు.

దౌల్తాబాద్: కలెక్టర్ ప్రతీక్‌జైన్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిలపై జరిగిన దాడిని మండల కాంగ్రెస్ నాయకులు వెంకట్రావ్, వెంకట్‌రెడ్డి, వీరన్న, వెంకట్రాములు, రెడ్డి శ్రీను, సేవ్యానాయక్, కోటంరాములు, నర్సింహులు, సత్యపాల్, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ తదితరులు ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు.


బొంరాస్‌పేట్: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవాబుపేట: కలెక్టర్, కడా ప్రత్యేకాధికారిపై దాడిని నవాబుపేట మండల తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఖండించారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తాండూరు: కలెక్టర్ ప్రతీక్‌జైన్‌పై లగిచర్ల గ్రామస్తులు దాడిచేయడం మంచి పరిణామం కాదని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ అన్నారు. ఫార్మా కంపనీ ఏర్పాటును వ్యతిరేకించే హక్కు గ్రామస్థులకు, రైతులకు ఉందని, అభిప్రాయ సేకరణకువచ్చిన అధికారులపై దాడిచేయడం సరికాదన్నారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

వికారాబాద్: విధి నిర్వహణలో ఉన్న కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర జిల్లా అధికారులపై జరిగిన దాడిని తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. జిల్లా అధికారులపై రైతుల పేరిట జరిగిన దాడికి నిరసనగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా పంచాయతీరాజ్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల నందకుమార్ తెలిపారు. జడ్పీ కార్యాలయం ఎదుట పంచాయతీరాజ్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య స్పందిస్తూ ఈ ఘటన అత్యంత హేయనీయమని అన్నారు. సామరస్యపూర్వకంగా సమస్యను పరిష్కరించుకోవాల్సింది పోయి దాడికి పాల్పడడం శోచనీయమన్నారు.


వికారాబాద్: జడ్పీ కార్యాలయం ఎదుట పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల నిరసన

కలెక్టర్‌పై దాడి దురదృష్టకరం: మాజీ ఎమ్మెల్యే ఆనంద్

ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన కలెక్టర్ మీద దాడి జరగడం దురదృష్టకరమని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. ప్రభుత్వం బలవంతంగా భూ సేకరణ చేస్తూ వారిని తీవ్ర మనోవేదనకు గురి చేసిందన్నారు. ఈ క్రమంలోనే వారు తిరుగబడ్డారన్నారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్య వైఖరి, రైతుల పట్ల అధికారుల పట్ల ఆయనకు ఉన్న కపట ప్రేమ బట్టబయలు అయిందన్నారు. రేవంత్ రెడ్డి తప్పుడు నిర్ణయాల వల్ల అటు ప్రజలు, ఇటు అధికారులు ఇబ్బందులకు గురయ్యారన్నారు.

అధికారులపై దాడి సరికాదు

ఫార్మా కంపెనీ భూసేకరణ ప్రక్రియలో భాగంగా లగచర్ల గ్రామ సభలో పాల్గొనడానికి వచ్చిన కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్లు విజయకుమార్, ఇతర రెవెన్యూ సిబ్బందిపై జరిగిన దాడిని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ (ట్రెసా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. జరిగిన దాడికి నిరసనగా జిల్లా వ్యాప్తంగా విధులు బహిష్కరించాలని నిర్ణయించగా, వారికి సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఘటనపై సీపీఐ కమిటీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ స్పందిస్తూ ఫార్మా కంపెనీ ఏర్పాటును వ్యతిరేకించే హక్కు ఆ గ్రామ ప్రజలకు, రైతులకు ఉంటుందని, అయితే అభిప్రాయ సేకరణకు వచ్చిన అధికారులపై దాడి చేయడం ప్రజాస్వామ్యంలో మంచి పరిణామం కాదన్నారు. బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్లనందు ఈ ఘటనపై స్పందించారు. అధికారులపై భౌతిక దాడులు బాధాకరమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం కల్పించాలన్నారు.

దాడి వెనక కుట్ర

లగచర్లలో అధికారులపై దాడిని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పి.మహిపాల్‌రెడ్డి ఖండించారు. ఈ దాడి వెనుక కుట్రకోణం ఉందని, సీఎం రేవంత్‌రెడ్డిని, ప్రభుత్వాన్ని ప్రజల్లో చులకన చేయాలనే దురుద్దేశంతో ఈ విధంగా దాడులకు తెగబడ్డారన్నారు. ఈ ఘటనలో తెర వెనక ఉన్న వారిని బయటకు లాగి కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'ఫార్మా కంపెనీతో రైతులకు నష్టం'

తాండూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలం లగచర్ల గ్రామ శివారులో ఫార్మా కంపెనీ పెట్టడం రైతులకు తీవ్ర నష్టమేనని బీఆర్ఎస్ తాండూరు మండల అధ్యక్షుడు సిరిగిరిపేట్ వీరేందర్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ లగచర్లలో రైతుల ఆవేదనలో అర్థముందన్నారు. వారికి న్యాయం చేయాలని సూచించారు. లగచర్ల గ్రామ సమీపంలో మూడు చెరువులు ఉన్నాయని, వాటితో రైతులు ప్రతీ సంవత్సరం రెండు పంటలు పండించుకుంటున్న తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మా సిటీ భూములు సేకరించడం సరికాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ఎలాంటి పదవిలో లేకున్నా నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతవరకు సమంజసమన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

ఘట్‌కేసర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో సోమవారం బీటీరోడ్డు నిర్మాణ పనులను ఆయన కమిషనర్‌తో కలిసి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వీరారెడ్డి, నాయకులు శేఖర్, అక్రంఅలీ, కాశయ్య, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవం


రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని యూనియన్ బ్యాంకు కార్యాలయాల్లో సోమవారం బ్యాంకు 106వ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ సహకారసంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి యూనియన్ బ్యాంకు బ్రాంచ్-1, బ్రాంచ్-3లలో ఖాతాదారులతో కలిసి కేక్‌చేశారు. మేనేజర్లు వివేక్‌కుమార్, జి.అనిల్ కుమార్, డిప్యూటీ మేనేజర్ కిషన్ పాల్గొన్నారు.

టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా పోకల సతీష్


నియామకపత్రం అందుకుంటున్న సతీష్

వికారాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టెలికాం అడ్వైజరీ కమిటీ(బీఎస్ఎన్ఎల్) సభ్యుడిగా వికారాబాద్ ప్రాంతవాసి పోకల సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి సోమవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్, చరణ్ రెడ్డి, సాయి, మహేష్, వెంకట్ అనిల్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

కొడంగల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మండలంలోని పర్సాపూర్‌లో సోమవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తహసీల్దార్ విజయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్త రైతులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై కలెక్టర్‌కు వినతి

బొంరాస్‌పేట్: మండలంలో రైతు సమస్యలపై కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. కొడంగల్‌లో సోమవారం కడా కార్యాలయంలో రైతులకు పంటరుణాల మాఫీ జరిగి 3 నెలలు గడుస్తున్నా బ్యాంకర్లు నేటి వరకు నూతన రుణాలు అందించడం లేదని తెలిపారు. బొంరాస్‌పేట్‌లోని ఎస్బీఐ బ్యాంకులో రుణాలు మాఫీ అయిన రైతులకు టెక్నికల్ ఇబ్బంది ఉందనే సాకుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మెట్లకుంట మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహులు నాయుడు, దేశ్యనాయక్, బాపల్లి సంతోష్‌నాయక్ పాల్గొన్నారు.

కులగణనలో తప్పులు లేకుండా చూడాలి

మోమిన్‌పేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేలో ఎన్యూమరేటర్లు తప్పులు లేకుండా వివరాలను నమోదు చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి సూచించారు. ఎన్కతలలో సోమవారం ఎన్యూమరేటర్లు చేపట్టిన సర్వేను ఆమె పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నర్సింహులు, బిందు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమ: బాసుపల్లి, బొంపల్లి గ్రామాల్లో సోమవారం ఎన్యూమరేటర్లు చేపట్టిన కులగణన సర్వేను ఎంపీడీవో మహేశ్‌బాబు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్‌లు పాల్గొన్నారు.

తాండూరు: తాండూరులో కులగణన సర్వేను వికారాబాద్ జిల్లా మెప్మా పీడీ రవికుమార్ సోమవారం తాండూరులో పరిశీలించారు.

పరిగి: సకుటుంబ సర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలని ఎంపీడీవో కరీం అన్నారు. మండలంలోని సయ్యద్‌మల్కాపూర్, నస్కల్ గ్రామాల్లో జరుగుతున్న సర్వేను సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కులకచర్ల/పరిగి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో మండలంలోని కామునిపల్లి విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. మోర అరుణ, శ్రీనివాస్ దంపతుల కుమారుడు మణికుమార్ పరిగిలోని సుదీక్ష(ఐవీఎస్ఈ) పాఠశాల తరఫున వరంగల్‌లో ఆదివారం స్టార్‌ఆర్ట్స్ అకాడమి నిర్వాహకులు నిర్వహించిన పాటల పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నాడు. ఏడోతరగతి విద్యార్థిని అశ్విత చిత్రలేఖనం పోటీలో ప్రథమ స్థానంలో నిలిచింది. వీరిని పాఠశాల డైరెక్టర్ వీరేశం, ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్,ఉపాధ్యాయులు సత్కరించారు.

ప్రి రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎంపిక

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపికయ్యారు. నేటి నుంచి ఈనెల 21వరకు కేసీబీ నార్త్‌మహారాష్ట్ర యూనివర్సిటీలో నిర్వహించనున్న పరేడ్‌లో కిషన్‌సాయి, చదువుతున్న తేజలు పాల్గొంటారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేష్ తెలిపారు. వీరిని పి డీన్లు విజయ్‌కుమార్, విష్ణుమూర్తి, మంగళగౌరి, ఎన్ఎస్ఎస్ కన్వీనర్ దాసరి రాగిణిలు అభినందించారు.

మరణ ధ్రువీకరణ పత్రానికి డబ్బులు డిమాండ్

దౌల్తాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మరణ ధ్రువీకరణ పత్రం కోసం పంచాయతీ కార్యదర్శి డబ్బులు డిమాండ్ చేసినట్లు దౌల్తాబాద్ మండలంలోని గోకఫస్లాబాద్ గ్రామానికి చెందిన బండ కేశవరెడ్డి ఆరోపించాడు. ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వారం రోజుల కిందట తన తండ్రి నారాయణరెడ్డి మృతి చెందడంతో గ్రామ పంచాయతీలోని కార్యదర్శితో మరణధ్రువీకరణ పత్రం ఇవ్వాలని కోరగా కార్యాలయ ఖర్చుల కోసం రూ.1000 ఇవ్వాలనడంతో రూ.500అందించినట్లు తెలిపారు. ఈవిషయంపై ఆంధ్రజ్యోతి పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లకు, కార్యాలయ ఖర్చులకు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందనడం గమనార్హం.

అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

మూడుచింతలపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం సేవలు చిరస్మరణీయమని ఏఎంసీ చైర్మన్ నర్సింహులుయాదవ్ అన్నారు. జగ్గంగూడ గ్రామపరిధిలో ఉన్న తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి 'ఎతఃఓఏఠివిగీఉ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

తాండూరు రూరల్: జినుగుర్తి మైనార్టీ బాయ్స్ హాస్టల్‌లో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా విద్యార్థుల వేసిన చిత్రపటాలను ప్రదర్శించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాగప్ప, జర్నప్ప, గోపాల్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొంరాస్‌పేట్: మండలంలోని కొత్తూర్ 33/11 కేవీ కొత్తూర్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

మేడ్చల్ టౌన్: మేడ్చల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు పట్టణంలోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా గుండ్లపోచంపల్లిలోని 33/ 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

శబరిమల, పంచారామాలకు ప్రత్యేక బస్సులు

తాండూరు: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపోమేనేజర్ సురేష్ తెలిపారు. ఈనెల 17, 24 తేదీల్లో హైదరాబాద్-2 డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. వివరాలకు ఫోన్‌నంబర్ 9959225253, 9959226249లను సంప్రదించాలని సూచించారు.

సనాతన ధర్మ పరిరక్షణకు పాదయాత్ర

కీసర: కార్తీకమాసం సందర్భంగా ఓమౌజా ఆశ్రమం నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని ఓమౌజా శ్రీ భవతి ఆశ్రమం వరకు సోమవారం పాదయాత్ర చేపట్టారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

పరిగి: పరిగి మినీస్టేడియంలో సోమవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జూనియర్ అండర్-17 క్రికెట్ పోటీలను సోమవారం పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ ప్రారంభించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

పరిగి: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. పరిగిలోని జడ్పీహెచ్ఎస్‌నెం.01 పాఠశాలలో సోమవారం వంటలను పరిశీలించారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

మేడ్చల్ టౌన్/కులకచర్ల: మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం రాత్రి చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి పాల్గొన్నారు. కులకచర్ల పరిధి ఘనపూర్‌లో సోమవారం హైమాస్ట్ లైట్లను కాంగ్రెస్ నాయకుడు బుచ్చిరెడ్డి ప్రారంభించారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని మక్తలో స్థానిక శివాలయం వద్ద గతరెండు నెలల కిందట డ్రైనేజీని తవ్వి వదిలేయడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని స్థానికుడు భైరు పాండు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.

ఆలయ ఈవోకు సన్మానం

కులకచర్ల: సంఘ సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం ఇటీవల ఈవోకు డాక్టరేట్ అవార్డును ప్రకటించిన సందర్భంగా బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వర ఆలయ ఈవో సుధాకర్‌ను స్థానికులు సోమవారం సన్మానించారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

ఘట్‌కేసర్ రూరల్: మైసమ్మగూడలోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో జరిగిన వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో అవుషాపూర్‌లోని వీబీఐటీ వాలీబాల్ క్రీడాకారులు ప్రథమ బహుమతి సాధించారు. వీరిని కళాశాల చైర్మన్ గౌతంరావు అభినందించారు.

చెక్కుల పంపిణీ

దోమ: బొంపల్లి గ్రామానికి చెందిన అఫ్రీన్‌బేగంకు సోమవారం మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు సోమవారం అందజేశారు.

వార్డు అభివృద్ధికి కృషి

తాండూరు: 20వ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు కౌన్సిలర్ సంగీత ఠాకూర్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె వార్డులో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు.

విద్యార్థులకు అవగాహన

దోమ: కేజీబీవీలో సోమవారం పరిగి సబ్‌డివిజన్ షీటీం ఇన్‌చార్జి నర్సింహులు, వికారాబాద్ కళాజాత బృందం సభ్యులు అశోక్ సదస్సు నిర్వహించారు.